బయో ఆసియా...
ఆవిష్కరణలు అదుర్స్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభమైన లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్ ఫోరమ్ బయో ఆసియా సదస్సు 22వ ఎడిషన్‌లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ట్రేడ్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన పలు స్టాల్స్‌ను పరిశీలిస్తే..

ప్రయోగాలకు ఎలుకలు అందిస్తాం



వ్యాక్సిన్‌లు లేదంటే ప్రాణ రక్షక ఔషధాల పనితీరును ముందుగా పరీక్షించేది మానవ జన్యు నిర్మాణానికి దగ్గరలో ఉన్న ఎలుకలు, కోతులు వంటి వాటి పైనే. ప్రీ క్లినికల్ ట్రయల్స్‌కు ఇప్పటికీ ఎలుకలపై ఆధారపడుతుంటారు. నిర్ధిష్టమైన సమస్యను లక్ష్యంగా చేసుకుని ప్రయోగాలు చేసే కంపెనీల కోసం ఎలుకలలో జన్యు పరివర్తన చేసి ఇచ్చే సంస్థ జనీవర్ ల్యాబ్స్. ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ప్రస్తుతం మనిషి కాలేయానికి దగ్గరగా ఉండే రీతిలో కాలేయం కలిగిన ఓ ఎలుకను అభివృద్ధి చేశామని, కాలేయ వ్యాధులపై పరిశోధనలకు ఇది తోడ్పడుతుందని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ హెడ్ లిలీ పేర్కొంటున్నారు. బెంగళూరులో పదేళ్లుగా ఉంటున్న ఆమెకు హైదరాబాద్‌లోని పలు కంపెనీలకు సైతం తాము వీటిని సరఫరా చేశామంటున్నారు.

ప్రొటీన్ సీక్వెన్సింగ్‌ను సులభంగా చేస్తోంది



ప్రొటీన్ సీక్వెన్సింగ్ అనేది చాలా వరకూ ఫార్మా ల్యాబ్‌లతో పాటుగా డయాగ్నస్టిక్ ల్యాబ్‌లలోనూ కనిపిస్తుంది. గతంలో ప్రొటీన్ సీక్వెన్సింగ్ చేయాలంటే సమయం, ఖర్చుతో కూడుకోవడంతో పాటు ఫలితాలపై కూడా సందేహం ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్లాటినం ప్రొటీన్ సీక్వెన్సర్ తీసుకువచ్చామంటున్నారు క్వాంటమ్ డాట్ ఎస్ఐ ప్రతినిధులు. దీనికోసం ప్రత్యేకంగా ల్యాబ్ అవసరం లేదని, నైపుణ్యం కూడా పెద్దగా అవసరం లేదంటున్నారు.

స్మార్ట్ రీయూజబుల్ నోట్ బుక్



ఏఐతో పనిచేసే స్మార్ట్ రీ యూజబుల్ నోట్ బుక్‌ను విడుదల చేసింది క్వాడ్రిక్ ఐటీ సంస్థ. టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఈ సంస్థ రీనోట్ ఏఐ పేరిట దీనిని విడుదల చేసింది. మీరు మీ నోట్స్‌తో మాట్లాడే అవకాశం కల్పించే ఈ రీనోట్, మీకు కావాలనుకుంటే అదనపు సమాచారం కూడా అందిస్తుంది. ఈ నోట్‌బుక్ వాటర్‌ప్రూఫ్, చిరగదు. డాటా ఎప్పటికీ మీ బుక్‌లోనే ఉంటుంది. దీని ధర రూ.999. కానీ, ఆఫర్‌లో భాగంగా రూ.499 అందిస్తున్నారు.

ప్యాకేజింగ్‌లోనూ పర్యావరణ పరిరక్షణ

వ్యాక్సిన్‌ల ప్యాకేజింగ్‌లకు ఉష్ణోగ్రత నియంత్రణ తప్పనిసరని ప్లానెట్ ప్రొటెక్టర్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఊలుతో తయారుచేసిన ప్యాకేజింగ్ బాక్స్‌లను వీరు బయో ఆసియా సదస్సులో భాగంగా ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతానికి ఆస్ట్రేలియాలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ సంస్థ తమ మలి మజిలీగా హైదరాబాద్‌ను ఎంచుకుంది. త్వరలోనే ఇక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుందని సంస్థ ప్రతినిధి నమిత బంకా తెలిపారు.

డీఎన్ఏ ప్రొఫైలింగ్ అందుబాటులోకి : ఏజిలెంట్ టెక్నాలజీ

మన శరీర పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేయించుకోవాలి. ఇలా చేయడం ద్వారా రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడం, చికిత్స అందించడం సులభతరం అవుతుంది. ఏజిలెంట్ టెక్నాలజీ డీఎన్ఏ విశ్లేషణకు అవసరమైన యంత్రాలను సమకూర్చుతుంది. వీటిని ప్రముఖ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలకు అందిస్తున్నాం.

ఫార్మా క్లినికల్ ట్రయల్స్‌లో ఏఐ సహకారం : కోగెనిక్ ఏఐ

కృత్రిమమేథ సహకారంతో ఫార్మా రంగంలో ఔషధాల తయారీ, క్లినికల్ ట్రయల్స్ పరిశోధనలను సులభంగా నిర్వహించే అవకాశాన్ని కోగెనిక్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఔషధాల తయారీతోపాటు వాటి వినియోగం వల్ల వచ్చే దుష్ఫలితాలను కృత్రిమ మేథ ద్వారా గణించి, ప్రభుత్వ నిబంధనలకు తగిన విధంగా నివేదికను రూపొందించే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు సంస్థ కో ఫౌండర్ రోమేష్ సేత్ తెలిపారు.

ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే ఈజీ సర్వర్ రూమ్



ఐటీ, ఫార్మా సంస్థలు తమ కంప్యూటర్లను, అందులో ఉన్న సమాచారాన్ని భద్రపరుచుకునేందుకు సర్వర్లు కీలకం. వెర్టివ్ సర్వర్ రూమ్‌ను అన్ని భద్రత ఏర్పాట్లతోపాటు సులభంగా ఒకచోట నుంచి మరో చోటికి తీసుకెళ్ల వచ్చని తయారీ దారులు తెలిపారు. ప్లగ్ అండ్ ప్లే తరహాలో సర్వర్ రూములు రూపొందిస్తున్నామని, ఆయా సంస్థలకు అవసరమైన విధంగా కస్టమైజేషన్ చేసి అందిస్తామన్నారు.

రూ.4,030 కోట్లతో
రతన్‌టాటా రోడ్డు

- 41.50 కి.మీల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారి
- 28 నుంచి టెండర్లు



రతన్ టాటా రోడ్డు (చిలకపచ్చ రంగులో ఉన్న గీత)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్‌లోని రావిర్యాల(టాటా ఇంటర్‌చేంజ్) నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ఆమన్‌గల్ వద్ద ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారికి రాష్ట్ర ప్రభుత్వం రతన్‌టాటా రోడ్డుగా పేరు పెట్టింది. ఈ రోడ్డును రూ.4,030 కోట్లతో నిర్మించనున్నారు. 41.50 కి.మీ.ల పొడవు ఉండే ఈ రతన్ టాటా రహదారి నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో రూ.1,665 కోట్లతో ఓఆర్ఆర్ రావిర్యాల(టాటా ఇంటర్‌చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.2 కి.మీ దూరం రోడ్డు నిర్మాణం చేపడతారు. రెండోదశలో రూ.2,365 కోట్లతో మీర్‌ఖాన్‌పేట(ఫ్యూచర్‌సిటీ) నుంచి ఆర్ఆర్ఆర్ (ఆమన్‌గల్) వరకు 22.30 కి.మీ దూరం రహదారి నిర్మాణం చేయనున్నారు. ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం హెచ్ఎండీఏకు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) సంస్థలకు అప్పగించింది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను ఫిబ్రవరి 28 నుంచి స్వీకరిస్తామని హెచ్ఎండీఏ మంగళవారం ప్రకటించింది. టెండర్ వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సాంకేతిక బిడ్లను మార్చి 21న తెరుస్తామని హెచ్ఎండీఏ వెల్లడించింది.

శివరాత్రి ఎఫెక్ట్..
పెరిగిన పండ్ల ధరలు

- ద్రాక్ష కిలో రూ. 125
- ఆరెంజ్ వందకు నాలుగు



పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

ముషీరాబాద్/కవాడిగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పండ్ల ధరలు భారీగా పెరిగాయి. ముషీరాబాద్, రాంనగర్, భోలక్‌పూర్, శివాలయం చౌరస్తా, ఇందిరాపార్కు తదితర ప్రాంతాల్లో కిలో పుచ్చకాయ రూ.30, ద్రాక్షా కిలో రూ.125, ఆరెంజ్ వందకు 4, యాపిల్ వందకు 4, సపోట కిలో రూ.80, కర్బూజ కిలో రూ. 80 నుంచి 90, కర్జూర 250గ్రాములు రూ.80కు విక్రయిస్తున్నారు. తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లు, దుకాణాల వద్ద పండ్ల అమ్మకాలు ఎక్కువగా కొనసాగుతున్నాయి. లాభాలు ఎక్కువగా ఆశించకుండా పండ్లను విక్రయిస్తున్నామని రాంనగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి హిమాన్షు తెలిపారు.

పాలకులు సైంటిఫిక్ అక్షరాస్యులుగా మారాలి

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పాలకులు సైంటిఫిక్ అక్షరాస్యులుగా మారాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ బాలోత్సవం సైన్స్ ప్రయోగాల ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అజ్ఞానం రాజ్యమేలుతున్న తరుణంలో విజ్ఞానానికి పునాదులు వేసి ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని, అదే శాస్త్రీయ ఆలోచన అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సుజావతి. కోశాధికారి జి. బుచ్చిరెడ్డి, నవీన్, బ్రాహ్మణి పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విజ్ఞాన, శాస్త్రీయ ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి జహంగీర్, స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచికుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సంగీతం.. సాగరంలో పంట కాలువలాంటిది

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగీతం అంటే కేవలం సినిమాపాట మాత్రమే కాదని, సాగరంలో పంట కాలువలాంటిదని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. సారంగి మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువు సుప్రియా చక్రవర్తి శిష్య బృందం లలిత గీతాల మధురగానంతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్వతీశం మాట్లాడుతూ.. జానపద గీతాలకు సారంగి సహ వాయిద్యం అని, అలాంటి వాయిద్య పరికరం సంస్థ పేరు కావడం శాస్త్రీయ సంగీతం పట్ల నిర్వాహకులకు ఉన్న అంకితభావం తెలియజేస్తుందన్నారు.

యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, గాయని సురేఖ, నాట్యగురువు స్వాతి భాగవతుల, రచయిత్రి సుందరవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి : పీవైఎల్

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి ఇవ్వాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ ప్రదీప్, బి. అజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నిరుద్యోగులకు బడ్జెట్ కేటాయించాలన్నారు. పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం. రవికుమార్, సభ్యులు జె దశరథ్, బీఎస్ కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ముషీరాబాద్‌లో బీజేపీని బలోపేతం చేయండి'

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరతగౌడ్ సూచించారు. మంగళవారం జరిగిన అడిక్‌మెట్ డివిజన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డివిజన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్‌కు సూచించారు.

గంగపుత్రుల సంక్షేమానికి మల్లయ్య సేవలు మరువలేనివి



మల్లయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, వకుళాభరణం కృష్ణమోహన్, మెట్టు సాయికుమార్ తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గంగపుత్రుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధనకోసం తెలంగాణ ప్రదేశ్‌గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా, మాజీ చైర్మన్ దివంగత ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, గంగపుత్ర విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మల్లయ్య ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్‌రావు, ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, ప్రొఫెసర్ భాగయ్య, ఏసీపీ సంతోష్‌కుమార్ పాల్గొని మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. గంగపుత్రులు, మత్స్యకారుల హక్కుల పరిరక్షణ కోసం మల్లయ్య ఎంతో కృషిచేశారన్నారు. చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ పథకం అమలు చేయించి వారిని ఆదుకున్నారని గుర్తుచేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూల రవీందర్ లాంటి గెలిచే బీసీ అభ్యర్థులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సామాజిక వర్గం వారికే టికెట్లు కేటాయించడం ఎంత వరకు సామాజిక న్యాయమని ప్రశ్నించారు. "బీసీ కులాల స్థితిగతుల్లో మార్పు-విద్యావంతుల పాత్ర" అంశంపై ప్రొఫెసర్ కె. మురళీ మనోహర్ మాట్లాడుతూ.. బీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడానికి విద్యావంతులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శివరత్నం, జి.మల్లేష్, రాంచందర్, శంకర్, కాయ హనుమంతు. మెట్టు ధనరాజ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మల్లయ్య ఆశయ సాధనకు గంగపుత్రులు కృషి చేయాలి

కవాడిగూడ: బండమైసమ్మనగర్‌లోగల మల్లయ్య విగ్రహానికి తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్, పలు బీసీ సంఘం నేత మీనగోపి, గంగపుత్ర సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లయ్య ఆశయ సాధనకు గంగపుత్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, శంభుల ఉషశ్రీ

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ పేర్కొన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శ తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళావిభాగం అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ ఆధ్వర్యంలో నారీ న్యాయ్ సమ్మేళన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అల్కాలాంబ మాట్లాడుతూ.. గ్రేటర్‌లో పార్టీ బలోపేతానికి మహిళా నాయకురాళ్లు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు, మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎన్ రెడ్డి తదితరులు

10వ తరగతిలో గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో గ్రేడింగ్ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి కోరారు. మంగళవారం ట్రస్మా ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ ఫీజు తీసుకుని మంచి ఫలితాలు సాధిస్తున్న బడ్జెట్ పాఠశాలలకు విద్యుత్, నీటి బిల్లులు, ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గించాలని కోరారు. ట్రస్మా ప్రధాన కార్యదర్శి కె. అనిల్‌కుమార్, కోశాధికారి కె. శ్రీకాంత్‌రెడ్డి, సలహాదారుడు అనంతరెడ్డి, అధికార ప్రతినిధి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'మగ్దూమ్ మొహియుద్దీన్ త్యాగం నిరుపమానం'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మగ్దూమ్ మొహియుద్దీన్ త్యాగం నిరుపమానం అని ఎమ్మెల్సీ ఎస్. మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం మొహియుద్దీన్ సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నిజాం నవాబు నియంత పాలనకు వ్యతిరేకంగా తన రచనలతో బలహీనుల పక్షం నిలిచిన యోధుడు మగ్దూమ్ అని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. మొహియుద్దీన్ రచనలు ఆనాడు ప్రజలను ఎంతో ప్రభావితం చేశాయన్నారు.

'వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు'

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, సైఫాబాద్, మెహిదీపట్నం డివిజన్‌లలో వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ పి. వెంకన్న తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం కాచిగూడలో జరుగుతున్న రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ)పనులను డీఈలు కమల్‌కుమార్, శ్రీధర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బకాయిల వసూలుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ జ్యోతియాత్ర

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు లక్ష్మీనరసింహస్వామి 31వ అఖండ జ్యోతియాత్ర నిర్వహిస్తున్నామని అఖండ జ్యోతియాత్ర కమిటీ చైర్మన్ సద్ధి వెంకటరెడ్డి తెలిపారు. బర్కత్‌పురలోని యాదాద్రి భవనం నుంచి ఉదయం 10 గంటలకు అఖండ జ్యోతియాత్ర ప్రారంభమవుతుందన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అఖండజ్యోతి యాత్ర నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ముషీరాబాద్, తార్నాక, ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా మార్చి 1న యాదాద్రి చేరుకుంటుందన్నారు.

భవానీ శంకర ఆలయంలో శివుడికి బిల్వార్చన

ముషీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలోని భవానీ శంకర దేవాలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి బిల్వార్చన పూజలు నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, అఖండ దీపారాధన కార్యక్రమాలు జరిగాయి.

మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించండి

- అధికారులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచన

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగ సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ ట్రాన్స్‌కోతోపాటు వివిధ శాఖల అధికారులతో రంజాన్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. డీఎంసీ రామానుజుల రెడ్డి, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ, బేడ, బుడగ జంగం కులాలకు
ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదిగ, బేడ, బుడగ జంగాలకు ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించాలని మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ విజ్ఞప్తి చేశారు. మంగళవారం బర్కత్‌పురలోని మహాకూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ, బేడ, బుడగ జంగాలకు ఎమ్మెల్సీ టికెట్లు కేటాయిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామన్నారు.

మోచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌ప్రేమ్‌రాజ్, మహాకూటమి గ్రేటర్ అధ్యక్షుడు కొండరాజు మాదిగ, సికింద్రాబాద్ అధ్యక్షుడు జనార్దన్, హైదరాబాద్ అధ్యక్షుడు మహేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి మగ్గంను బహూకరిస్తున్న కత్తుల సుదర్శన్ తదితరులు

అజయ్ కుటుంబాన్ని ఆదుకున్న కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భారతమాత మహా హారతి సందర్భంగా గతనెల 26న హుస్సేన్‌సాగర్‌లో పడవలో బాణసంచాపేలి మృతి చెందిన చెరుపల్లి అజయ్ కుటుంబానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రూ.20 లక్షలు, ఒకరికి ఉద్యోగం ఇప్పించారని పద్మశాలి సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు తెలిపారు. మంగళవారం బర్కత్‌పురాలో సిరిసిల్ల నుంచి తీసుకువచ్చిన చేనేత మగ్గంను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, పద్మశాలి సంఘం గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి రాజునేత, అఖిల భారత పురోహిత సంఘం అధ్యక్షుడు గుర్రం బొజ్జయ్య, అఖిలభారత పద్మశాలి సంఘం కార్యదర్శి రచ్చ నాగరాజు. జాతీయ చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడు చిక్కా దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన పాట్ల రాకేష్(19) సిటీ కాలేజీలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి జామై ఉస్మానియా - విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. 'తాను చనిపోయిన విషయం దివ్యకు తెలియజేయాలని, తన మృతికి ఎవరూ కారణం కాదని' రాసిన సూసైడ్ నోట్ మృతదేహం వద్ద లభించిందని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

రాంనగర్/చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. మార్చి 25 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమాన్ని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవపున్నయ్య హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభించారు. సోమయ్య మాట్లాడుతూ సంఘానికి సభ్యత్వం బలమని అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్, హెచ్‌యూజే అధ్యక్షుడు అరుణ్‌కుమార్, కార్యదర్శి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ పెంపునకు రాజ్యాంగ సవరణ చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ పెంచడానికి రాజ్యాంగ సవరణ చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆరె మహేందర్, ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కె. రామాంజనేయులు కోరారు. మంగళవారం వారు చిక్కడపల్లిలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన జరిగినప్పుడే బీసీల బతుకులు మారతాయన్నారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు దశరథం, జైపాల్ పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్ట్

బర్కత్‌పుర ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):యువతిని మోసం చేసిన యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. చైతన్యపురిలో నివసిస్తున్న సాయినిఖిల్(23)కు అంబర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ యువతి ఫేస్‌బుక్‌లో పరిచయం అయింది. మూడేళ్లుగా ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. పెళ్లి చేసుకుంటానని ఆమెను నిఖిల్ మోసం చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి అదృశ్యం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. శివరాంపల్లికి చెందిన సుధ తమ్ముడు దినేష్ కుమార్ భట్నా(43)తో కలిసి ఉజ్జయినిలో అంబేద్కర్‌నగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 23రాత్రి ఎక్కారు. 24 ఉదయం 5.30గంటలకు సుధ చూడగా దినేష్‌కుమార్ కనిపించలేదు. మంగళవారం నగరానికి చేరుకున్న ఆమె కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి మధ్యప్రదేశ్‌లోని ఆమ్లా రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ ఎల్లప్ప తెలిపారు.